ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 31 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 22 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY OCTOBER 31 2026 | VOL:1 | ISSUE: 22 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ

మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు

రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి

నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 30 :

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.



రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్

(మిగతా 2వ పేజీలో..)

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి



మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు

(మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన

హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు

వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం

ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు. సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం

(మిగతా 2వ పేజీలో..)

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు



మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్

(మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం



హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం

ప్రధాన రహదారులన్నీ జలమయం

పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్

ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల

(మిగతా 2వ పేజీలో..)

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్

కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ

మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి

రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి

విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై

(మిగతా 2వ పేజీలో..)



కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

ఉద్యోగం కోరుతూ సైగలతో విన్నవించుకున్న దివ్యాంగ యువకుడు

తక్షణమే స్పందించి హామీ ఇచ్చిన తమిళనాడు సీఎం విజయ్

కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవనంతో నగరానికి కొత్త ఆభరణం

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు భారీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని



తెలిపారు. 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 41 లక్షల కుటుంబాలకు చేయూత పథకం ద్వారా ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించేందుకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, అది తిరిగి వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులు

రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి తరగతులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించడం, శిక్షణ ఇచ్చే అధ్యాపకులను ఎంపిక చేయడం వంటి బాధ్యతలను పరిశ్రమల ప్రతినిధులకే అప్పగించినట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, నిర్మాణ రంగ సాంకేతికతలపై యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన యువతను ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నగరంలో లగ్జరీ గృహాలతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించే అంశంపై కూడా దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా నిర్మించిన ఎంఐజీ, ఎల్ఐజీ గృహాలు అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని గుర్తుచేశారు. అదే తరహాలో దీర్ఘకాలిక ప్రణాళికతో అందుబాటు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టికర్తలుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలు, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల సమన్వయంతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా, తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.



రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు.ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఓ దివ్యాంగ నిరుద్యోగి పట్ల మానవతా దృక్పథంతో స్పందించారు. ఉద్యోగం ఇప్పించాలని సైగలతో వేడుకున్న యువకుడికి కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తన హామీని నిలబెట్టుకున్నారు. ఇచ్చిన మాటను వెంటనే అమలు చేసిన ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. చెన్నై గిండిలోని ప్రభుత్వ వృత్తివిద్యా శిక్షణ సంస్థలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేశ్ అనే దివ్యాంగ యువకుడు సీఎంను కలిసి, తాను నిరుద్యోగినని, జీవనం కష్టంగా ఉందని సైగలతో వివరిస్తూ ఓ వినతిపత్రాన్ని అందించాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న విజయ్, తప్పకుండా సాయం చేస్తానని అక్కడికక్కడే భరోసా ఇచ్చారు.అనుకున్నదే తడవుగా, మరుసటి రోజైన గురువారం ఉదయం దినేశ్‌ను సచివాలయానికి పిలిపించారు. అక్కడ సీఎం విజయ్ స్వయంగా దినేశ్‌తో కరచాలనం చేసి, ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తిరువొత్తియూరులోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో సహాయకుడి పోస్టును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విజ్ఞప్తి చేసిన ఒక్క రోజులోనే ఉద్యోగం రావడంతో దినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన కష్టాన్ని అర్థం చేసుకుని తక్షణమే స్పందించిన సీఎం విజయ్‌కు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రజాప్రతినిధులు సమస్యలపై వెంటనే స్పందించాలనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు.ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ | శనివారం | 31 | 2026

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

గరిడేపల్లి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ పిలుపునిచ్చారు. ఈ మహాసభల ద్వారా రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల హక్కుల సాధనకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు మహాసభలకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి 12 ఏళ్లు గడిచినా రైతుల సంక్షేమానికి ఆశించిన చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 2 లక్షల రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయడంతో పాటు రైతుబంధు నిధులు విడుదల చేసి రైతులను



ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైదిరెడ్డి, సీతారాం రెడ్డి, జాన్ సైదా, వెంకన్న, సైదా నాయక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై అపోహలు తొలగించాలి.. వాస్తవాలు ప్రజలకు వివరించాలి

ధర్మసాగర్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలతో ప్రజల్లో ఏర్పడుతున్న అపోహలను తొలగించి, వాస్తవాలను వివరించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. బీజేపీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రముఖులు, ఓటర్లను కలిసి SIR ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వెంకట్ రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ప్రజలకు SIR ప్రక్రియపై వాస్తవాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగవెల్లి యుగేందర్, గంకిడి వెంకట్ రెడ్డి, గాజుల సంపత్, దాసరి సదానందం, బచ్చు శివప్రసాద్ రెడ్డి, సాయం సందీప్, వెంకటేష్, చింత రఘుదీర్, చింతల రాజు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



ములుకనూరు సహకార సంఘం అభివృద్ధి దేశానికే ఆదర్శం కావాలి

భీమదేవరపల్లి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ములుకనూరు సహకార సంఘం సాధిస్తున్న ప్రగతి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి డా. జి. చిన్నారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘాన్ని సందర్శించి కార్యకలాపాలను పరిశీలించారు. సంఘం ప్రస్థానం, రైతుల అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన లఘుచిత్రాన్ని వీక్షించారు. అనంతరం ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించి వాటి పనితీరును తెలుసుకున్నారు. సంఘం అభివృద్ధికి దూరదృష్టితో కూడిన నాయకత్వం, రైతుల పట్ల నిబద్ధత ప్రధాన కారణాలని ప్రశంసించారు. మాజీ నాయకుడు ఏ.కె. విశ్వనాథరెడ్డి సేవలను కొనియాడుతూ, ప్రస్తుత అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి 18 గ్రామాల రైతు కుటుంబాల సంక్షేమానికి చేస్తున్న కృషిని అభినందించారు.



సమగ్ర సస్యరక్షణ విధానాలపై రైతులకు అవగాహన

కీతవారిగూడెం, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా కీతవారిగూడెంలో రైతులకు సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులోని సెయింట్ థెరిసా మహిళా కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంటలను ఆశించే చీడపీడలను నియంత్రించేందుకు పంట మార్పిడి, పొలాల పరిశుభ్రత, సమతుల్య ఎరువుల వినియోగం, పసుపు రంగు జిగురు అట్టలు, కాంతి ఎరలు, మిత్ర పురుగులు, జీవ నియంత్రణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అవసరమైనప్పుడు మాత్రమే సిఫారసు చేసిన మోతాదులో పురుగుమందులు వినియోగించాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో పురుగుమందుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆరోగ్య భద్రత, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని విద్యార్థినులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థినులు వై. సౌమ్య, పి. హేమలత, ఐ. సత్యజ్యోతి, వై. మనీషా, ఎం. నవ్యశ్రీతో పాటు రైతులు ముంత నాగయ్య, గూడెపు అంజయ్య, బానోతు సైదులు, కత్రేవుల వెంకటేష్, లింగయ్య, మామిడి సతీష్, సాలిగంటి నాగేశ్వరరావు, ఎస్.కె.




పెరుసాహెబ్, యల్లవుల సైదులు, వెల్పుల రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ

సూర్యాపేట, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సర్వే ద్వారా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కోర్సులు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్ఐఈఎల్ఐటీ, ఆర్‌సెట్టి, సీఐటీడీ, టాస్క్ తదితర సంస్థల సమన్వయంతో యువతకు శిక్షణ, ద్రువీకరణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. స్థానిక పరిశ్రమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉపాధి పొందేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. టాస్క్ సమన్వయంతో జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని, కేంద్రం అందుబాటులోకి వస్తే యువతకు విస్తృతంగా శిక్షణ తరగతులు నిర్వహించవచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో డి. ప్రేమ్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎం.ఎ. భారతి, వివిధ శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో జనగర్జన.. పోడు హక్కులు, మండల అభివృద్ధి కోసం భారీ ధర్నా!

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, అక్టోబర్ 30, (ప్రజానేస్తం జ్వాల):



మండల అభివృద్ధి, పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రంలో ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ధర్నా నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న అభివృద్ధి సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు న్యాయం చేయాలని, అర్హులైన వారందరికీ భూములపై హక్కులు కల్పించాలని కోరారు. మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ఈ ధర్నాకు భారీగా ప్రజలు తరలిరావడంతో లింగాపూర్ మండల కేంద్రం జనసంద్రమైంది.

వెలిదండలో అంగన్వాడీ భవన స్లాబ్ పనులు ప్రారంభం

వెలిదండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నిర్మిస్తున్న నూతన అంగన్వాడీ భవన స్లాబ్ పనులను గురువారం గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జంగం కోటేశ్వరరావు, వార్డు సభ్యులు కామళ్ల వెంకటి, దుగ్గి చైతన్య, తిరుపయ్య, నాయకులు కామళ్ల ధైర్యప్ప, తుల్లూరి లూకాస్, నాగరాజు, చింతమల్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో డ్రగ్స్ కలకలం.. 107 మందికి పరీక్షలు, 29 మందికి పాజిటివ్!

వరంగల్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్.బి. నగర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 107 మందికి డ్రగ్స్ పరీక్షలు చేయగా 29 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 ఎలక్ట్రిక్ మోటార్ పంపులను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఒక కేసు నమోదు చేశారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. నేరాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని, డ్రగ్స్ లేదా ఇతర నేరాల సమాచారం డయల్ 100/112కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, ఇన్‌చార్జి ఏసీపీ నరసింహారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ తూర్పుకోటలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఖిలా వరంగల్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ఖిలా వరంగల్ తూర్పుకోటలో ఎం.కే. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన 5వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో మొత్తం 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షల్లో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించిన వైద్యులు, తదుపరి చికిత్స, శస్త్రచికిత్సల నిమిత్తం వారిని హైదరాబాద్‌లోని శంకర హాస్పిటల్‌కు తరలించారు. మరో 60 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. స్థానిక పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎం.కే. ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.

మాదకద్రవ్యాల మత్తుకు దూరంగా ఉండండి.. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి!

భీమదేవరపల్లి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల) :



యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని కాజీపేట ఎక్సైజ్ ఎస్ఐలు సాయిరాం, సురేష్ రెడ్డి సూచించారు. మండలంలోని ముల్కనూర్ ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కళాశాల ప్రిన్సిపల్ బి. శ్రీకాంత్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

అసిఫాబాద్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



కెడస్ట్రల్ మ్యాపులు లేని గ్రామాల్లో భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రైతులందరూ 100 శాతం సర్వేలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆసిఫాబాద్ జిల్లాలో రెండో విడతలో భాగంగా ప్రతి మండలంలో రెండు గ్రామాల చొప్పున రీ సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ హరిత తెలిపారు. సర్వేకు సంబంధించి రైతులకు టాంటాం ద్వారా, ఫోన్ కాల్స్‌తో ముందస్తు సమాచారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఎల్బీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

గరిడేపల్లి, అక్టోబర్ 30, (ప్రజానేస్తం జ్వాల న్యూస్):



ఎల్బీనగర్ గ్రామంలో ఈరోజు కందుల కోటమ్మ, బల్లెడ్డి గార్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ బోద సైదిరెడ్డి గారు హాజరై కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రేమలత, ఏఈ యోగి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి వీరరెడ్డి, అనిల్, ఇళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పిల్లి అంజయ్య, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది.

పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

గరిడేపల్లి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6వ తేదీలోగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుగులోత్ సాంపు నాయక్ కోరారు.మండల పరిధిలోని గారకుంట తండాలో గురువారం పట్టభద్రులను కలిసి ఓటు నమోదు దరఖాస్తు ఫారాలను అందజేశారు. డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు, ఉపాధ్యాయులు, ఇతర పట్టభద్రులు తమ విద్యార్హత ధ్రువపత్రాలను అందిస్తే ఓటు నమోదు ప్రక్రియలో సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుగులోత్ సందీప్ నాయక్, నరేందర్ నాయక్, పట్టభద్రులు కరుణాకర్ నాయక్, రామకోటి నాయక్, రవీందర్ నాయక్, రవి నాయక్, కోటయ్య, లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మర్రికుంటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

గరిడేపల్లి, అక్టోబర్ 30, (ప్రజానేస్తం జ్వాల న్యూస్):



మర్రికుంట గ్రామంలో ఈరోజు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి, పోనుగోడు సర్పంచ్ కటికం వేణు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భద్రయ్య, ఉపసర్పంచ్ వసుమతి, గ్రామ కార్యదర్శి రమ్య, హౌసింగ్ ఏఈ యోగి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావడంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమైంది.

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వంటగది, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. వసతి గృహ పరిసరాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రతి జిల్లాలో 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 5 వేల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను గుర్తించి భర్తీ చేయాలని కోరారు.శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర వికలాంగుల డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంపు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు, చట్టబద్ధమైన రిజర్వేషన్ల అమలు వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.హామీలను తక్షణమే అమలు చేయకపోతే కొడంగల్ నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేసి, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ వికలాంగుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాఫర్‌గఢ్ గురుకులంలో రూ.42 లక్షల ఆర్థిక అక్రమాల ఆరోపణలు.. ప్రిన్సిపాల్ సంతకం ఫోర్జరీ చేసినట్లు ఫిర్యాదు!

జనగామ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ప్రమేయం వంటి అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ గురుకులంలో సుమారు రూ.42 లక్షల ఆర్థిక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. గురుకుల మహిళా ప్రిన్సిపాల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు జూనియర్ అసిస్టెంట్‌పై ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.గురుకులానికి సరుకులు, సేవలు అందించిన వెండర్లకు చెల్లించాల్సిన 35 చెక్కులను వారి పేర్లకు బదులుగా తన స్నేహితుల పేర్లపైకి మార్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చెక్కుల ద్వారా సుమారు రూ.42 లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారాన్ని గుర్తించిన మహిళా ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చెక్కుల లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు జరిగిన నగదు బదిలీల వివరాలను పరిశీలిస్తున్నారు.ప్రభుత్వ విద్యాసంస్థలో ఇంత భారీ మొత్తంలో ఆర్థిక అవకతవకల ఆరోపణలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో పూర్తి వాస్తవాలు, నిధుల వినియోగం, ఇతరుల

ఆదివాసీల హక్కులను గౌరవించాలి.. అడవుల సంరక్షణకు సహకరించాలి

కుమురం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ఆదివాసీల హక్కులు, అటవీ సంరక్షణ, ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై డీఎఫ్ఓ బాలమణితో తుడుందెబ్బ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 1/70, పెసా చట్టాలను గౌరవించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పించవద్దని, ఆదివాసీల సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు కోరారు. దీనిపై డీఎఫ్ఓ సానుకూలంగా స్పందిస్తూ ఆదివాసీల పండుగలు, ఆచారాలకు అవసరమైన కట్టెల వినియోగానికి అభ్యంతరం లేదన్నారు. అటవీ సంపద అక్రమ తరలింపును సహించబోమని, అటవీ సిబ్బంది వల్ల ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింటయ్యపల్లిలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భీమదేవరపల్లి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో చింటయ్యపల్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ భూక్య సునీత మణికంఠ ప్రారంభించారు. కొత్తకొండ--వేలేరు ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముప్పు సాయి చంద్ర, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం రవాణాపై రైతులపై ఆర్టీఓ కేసులు వద్దు: రాపోలు నవీన్ కుమార్

నేరేడుచర్ల, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ధాన్యం రవాణా సమయంలో ఓవర్‌లోడ్, వాహన పత్రాల పేరుతో రైతులపై ఆర్టీఓ అధికారులు కేసులు నమోదు చేయవద్దని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ కోరారు. నేరేడుచర్లలో రైతులతో మాట్లాడిన ఆయన, ఇప్పటికే అకాల వర్షాలు, విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు, దళారుల వల్ల గిట్టుబాటు ధర కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే సమయంలో కేసులు నమోదు చేయడం రైతులకు మరింత భారంగా మారుతుందన్నారు. ఆర్టీఓ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి, నిబంధనల పరిధిలో రైతులకు వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

సూర్యాపేట, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా, లేదా సంబంధిత ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో విద్యార్హత ధ్రువపత్రాలతో ఫారం-18 సమర్పించవచ్చన్నారు.అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల నమోదు ప్రక్రియపై సందేహాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు.

గిరిజన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి



హుజూర్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

చేవెళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గిరిజన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూర్‌నగర్ టౌన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు మంత్రి పదవి, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని, తండా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.అర్హులైన గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గిరిజన సమస్యలను పరిష్కరించాలని గిరిజన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నగేష్ రాథోడ్ కోరారు. 'గిరిజన గళం-తండాలో నిద్ర' పాదయాత్రకు పలు గిరిజన సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్, రూ.4 లక్షల బంగారం గుర్తింపు: ఎస్పీ కె.నరసింహ



సూర్యాపేట, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

కిరాణా దుకాణాల్లో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఖమ్మంకు చెందిన ఇద్దరు నిందితులను సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారాన్ని గుర్తించారు.ఈ నెల 11న కోదాడలో, 26న సూర్యాపేటలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులను సీసీటీవీ ఆధారంగా ఛేదించినట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా బహిష్కరణ, పీడీ యాక్ట్ అమలును పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సుగంధ ద్రవ్యాలతో పద్మాక్షి అమ్మవారికి విశేష అభిషేకం


హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



ఆశ్వీయుజ బహుళ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని చారిత్రక పద్మాక్షి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్టుకు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేసి, విశేషంగా అలంకరించారు.ఆలయ ప్రధాన పూజారులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, అభిషేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా సూర్యాపేటలో 'రన్ ఫర్ యూనిటీ'



సూర్యాపేట, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):

జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 31న సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. ఉదయం 6 గంటలకు ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు పరుగు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లోనూ ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ ఐక్యతను చాటాలని ఎస్పీ కోరారు. కార్యక్రమం ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా నుంచి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా మినీ ట్యాంక్ బండ్ వరకు కొనసాగుతుంది.

గిరిజన విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలి: కలెక్టర్ కె. హరిత

కొమురం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ కె. హరిత శుక్రవారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల ద్వారా విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చారు. క్రీడా కిట్లతో విద్యార్థులు సాధనను మరింత మెరుగుపరుచుకుని వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గిరిజన విద్యార్థులకు క్రీడల్లో అవకాశాలు కల్పించడం, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించేందుకు ఈ చర్య దోహదపడనుంది.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కాకతీయ విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, దీర్ఘకాలంగా పనిచేస్తున్న తమ సేవలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ ఉద్యోగ భద్రత, సేవా సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.అధ్యాపకుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన నాయిని రాజేందర్ రెడ్డి, నవంబర్ 2వ తేదీన ప్రభుత్వ పెద్దలు, ఉన్నత విద్యామండలి అధికారులను స్వయంగా కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో చర్చించి

హుజూర్‌నగర్‌లో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ పట్టణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన స్థలం కేటాయించి సహకరించాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడీ హక్కుల పోరాట సమితి) జాతీయ కమిటీ అధికార ప్రతినిధి బానోతు వెంకట్రాం నాయక్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బంజారా సమాజానికి ఆధ్యాత్మికంగా, సామాజికంగా మార్గదర్శకులైన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలు, బోధనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన సేవలు, సందేశాలను ప్రజలకు తెలియజేసేలా హుజూర్‌నగర్ పట్టణంలో విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సుమన్ నాయక్, సైదా నాయక్, నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు

పట్టభద్రుల ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి: కల్లూరు ధర్మేంద్ర

ఘట్‌కేసర్, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఏఐవైఎఫ్ నాయకులు గిరిబాబు, శివకుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకుని, తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఘట్‌కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పలు డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఫారం-18 ప్రతులను అందించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలు, సామాజిక న్యాయం వంటి అంశాలను శాసనమండలిలో ప్రస్తావించే ప్రతినిధులను ఎన్నుకోవడంలో పట్టభద్రుల ఓటు కీలకమన్నారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అభ్యర్థుల ప్రజా వైఖరిని పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొద్దుటూరి జ్యువెల్ గార్డెన్స్ సమీపంలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు డివైడర్ దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షి పాషా కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

నాణ్యత లోపిస్తే బిల్లుల్లో కోత విధిస్తాం: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



గ్రేటర్ వరంగల్ నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.శుక్రవారం పోతరాజుపల్లి, గిర్మాజీపేట, ఉర్సు, చార్‌బౌలి, లక్ష్మీపురం మార్కెట్, ఖాజీపేట, బంధం చెరువు, శాయంపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల్లో భారీగా కోత విధిస్తామని హెచ్చరించారు. అనంతరం శాయంపేటలో పారిశుద్ధ్య నిర్వహణను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మాతృభాష అధ్యయనంతోనే విద్యార్థుల సమగ్ర వికాసం: కేయూ వీసీ

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



విద్యార్థుల్లో మేధో వికాసం, ఆలోచనా శక్తి పెంపునకు మాతృభాషా అధ్యయనం ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి అన్నారు.2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి కేయూ పరిధిలోని డిగ్రీ తెలుగు మొదటి, మూడో సెమిస్టర్ నూతన పాఠ్యపుస్తకాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాషా సాహిత్యాల అధ్యయనం విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సృజనాత్మక ఆలోచనలను పెంపొందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ సురేష్ లాల్, వివిధ విభాగాల అధ్యాపకులు, భాషా పండితులు పాల్గొన్నారు.

నిట్‌లో ఆకట్టుకున్న రాకెట్, ఉపగ్రహ నమూనాలు

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో జరుగుతున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియాన్--26'లో ఏర్పాటు చేసిన అంతరిక్ష నమూనాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది.నిట్ సైన్స్ అండ్ ఆస్ట్రానమీ క్లబ్, స్పేస్ రీసెర్చ్ ల్యాబ్, ఏటీడీఆర్ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఇస్రోకు చెందిన ఎల్‌వీఎం3, పీఎస్ఎల్‌వీ రాకెట్లతో పాటు వివిధ ఉపగ్రహాల నమూనాలను ప్రదర్శించారు. శశాంక్ భూపతి, సనత్ కుమార్, శ్రీరామ్, జుబేర్, సుశాంత్ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రదర్శనను సందర్శించిన విద్యార్థులు ఉపగ్రహ ప్రయోగ సాంకేతికతపై వివరాలు తెలుసుకున్నారు.

2075 నాటికి మనిషి ఆయుర్దాయం 120 ఏళ్లకు చేరే అవకాశం

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



శాస్త్ర, సాంకేతిక, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రస్తుత పురోగతి కొనసాగితే 2075 నాటికి మానవుల ఆయుర్దాయం 120 ఏళ్లకు చేరే అవకాశం ఉందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాజీ కార్యదర్శి డా. శ్రీవారి చంద్రశేఖర్ అన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన తొలి ఎండోమెంట్ లెక్చర్‌లో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు వివిధ శాస్త్రరంగాల సమన్వయం, అంతరశాఖ పరిశోధనలు అవసరమని పేర్కొన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం, వ్యర్థాల పునర్వినియోగంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబద్ధత, నిజాయితీతోనే ఉన్నత లక్ష్యాల సాధన: ఐఏఎస్ గరిమా అగర్వాల్

హనుమకొండ, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, నిబద్ధత మరియు నిజాయితీతో కృషి చేసినప్పుడే ఉన్నత లక్ష్యాలను సాధించగలమని తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ అధికారిణి గరిమా అగర్వాల్ అన్నారు. వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న 'టెక్నోజియాన్--2026' వేడుకల్లో భాగంగా అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో విద్యార్థులతో ఆమె ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన సివిల్ సర్వీసెస్ ప్రయాణం, పాలనారంగంలో ఎదురయ్యే సవాళ్లు, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల బాధ్యతలను వివరించారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్.. ఒక్కొక్కరికి సగటున రూ.1.10 లక్షలు

సింగరేణి, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మొత్తం రూ.419 కోట్ల పీఎల్‌ఆర్ (PLR) బోనస్‌ను నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది.ఈ బోనస్ ద్వారా సుమారు 38 వేల మంది అర్హులైన కార్మికులకు సగటున ఒక్కొక్కరికి రూ.1,10,250 అందనుంది. ఇటీవల అందించిన దసరా బోనస్‌తో కలిపి నెల రోజుల వ్యవధిలో ఒక్కో కార్మికుడికి సగటున రూ.2.65 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. దీంతో సింగరేణి కార్మికుల్లో పండుగ ఉత్సాహం నెలకొంది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేటలో నేరగాళ్లపై పోలీసుల ఉక్కుపాదం..
జిల్లా బహిష్కరణకు ఎస్పీ నరసింహా మాస్టర్ ప్లాన్!

సూర్యపేట, అక్టోబర్ 30 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లాలో నేరాల నియంత్రణకు ఎస్పీ నరసింహా కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, వరుసగా నేరాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన వారిని జిల్లా నుంచి బహిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.జిల్లాలోని ఏ ప్రాంతంలో నేరం జరిగినా నిందితులను గుర్తించి పట్టుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. నేర పరిశోధనలో కొత్త వ్యూహాలను అమలు చేస్తూ పోలీసు నిఘాను మరింత బలోపేతం చేయనున్నారు. ఈ దీపావళి నుంచి రౌడీషీటర్లు, నేరగాళ్ల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడం, వారి భద్రతకు భరోసా ఇవ్వడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి: సీఎం రేవంత్ రెడ్డి

కొత్త రైలు మార్గాలకు అనుమతులు ఇవ్వాలి
అనంతారంలో మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి
రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి

న్యూఢిల్లీ

తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని రైల్ భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైలు మార్గాలు, హైస్పీడ్ రైలు కారిడార్లపై చర్చించారు.

హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్ త్వరగా ఖరారు చేయాలి

హైదరాబాద్--పుణె, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి ప్రతిపాదనలు పంపినట్లు సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు భూసేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను ఆమోదించిన తర్వాతే భూసేకరణ చేపడతామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని రైల్వే శాఖ మంత్రిని కోరారు.

వికారాబాద్--కృష్ణా రైలు మార్గానికి మంజూరు కోరిన సీఎం

130 కిలోమీటర్ల వికారాబాద్--కృష్ణా కొత్త రైలు మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని కేంద్ర మంత్రికి వివరించారు.

రీజినల్ రింగ్ రైలు అలైన్‌మెంట్‌పై విజ్ఞప్తి

హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (===) పక్కనే రీజినల్ రైలు మార్గాన్ని అలైన్‌మెంట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రీజినల్ రింగ్ రైలు ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

కొత్త రైల్వే మార్గాలకు అనుమతులు ఇవ్వాలి

తెలంగాణలో పలు కొత్త రైల్వే మార్గాలను వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. వాటిలో:

డోర్నకల్--గద్వాల్

కల్వకుర్తి--మాచర్ల

కాచిగూడ--జగ్గయ్యపేట (250 కి.మీ.)

పటాన్‌చెరు--ఆదిలాబాద్ (320 కి.మీ.)

బోధన్--లాతూర్ (175 కి.మీ.)

- అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.)

ఈ మార్గాలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతారంలో మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ డిపో నిర్మాణానికి అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.



9వ నెలలోనూ సమంత వర్కౌట్లు.. ప్రెగ్నెన్సీ ఫిట్‌నెస్ జర్నీ వీడియో వైరల్!



తొమ్మిదో నెల గర్భంతో ఉన్న నటి సమంత
తన ఫిట్‌నెస్ జర్నీని చూపిస్తూ సోషల్ మీడియాలో వీడియో షేర్
'ఎ9. ది ఫైనల్ ల్యాప్' అంటూ పోస్ట్ చేసిన సామ్
శరీరం చెప్పేది వింటూ వర్కౌట్లు చేస్తున్నానన్న సమంత

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'ఎ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు."ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు.